క్లుప్తంగా

అవగాహనతోనే క్షయ దూరం

తల్లాడ: అవగాహనతోనే క్షయ వ్యాధి దూరమవుతుందని మండల వైద్యాధికారి రత్నమనోహర్ అన్నారు. బుధవారం తల్లాడ పీహెచ్‌సీలో.. టీబీ అలర్ట్ ఇండియా వారి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షయ వ్యాధి పెద్దల్లోనే కాకుండా పిల్లల్లో కూడా వస్తుందని, లక్షణాలు గుర్తించి జిల్లా క్షయ నిర్మూలన కార్యాలయానికి పంపించాలన్నారు. దీనికై టీబీ అలర్ట్ ఇండియా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీబీ అలర్ట్ ఇండియా జిల్లా కోఆర్డినేటర్ ప్రభాకర్, నోడల్ అధికారి పెద్ద పుల్లయ్య, సూపర్వైజర్ వై.సురేష్, పల్లె దవాఖానా వైద్యులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



సమీక్షలో పాల్గొన్న అధికారులు

కల్లూరురూరల్: మండలంలోని అన్ని జీపీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎంపీఈఓ రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు అధికారులతో మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో వైద్య, ఆరోగ్యశాఖ, విద్యుత్‌శాఖ, మిషన్ భగీరథ, స్త్రీ,శిశు సంక్షేమశాఖ, పంచాయతీరాజ్ శాఖ, ఇందిరా క్రాంతి పథకం, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. గ్రామ పంచాయతీల వారీగా పథకాల అమలుపై శాఖల వారీగా నివేదికలు తయారు చేయాలని సమావేశంలో అధికారులను ఆదేశించారు.

జీలుగు పంట పరిశీలన



జీలుగు పంటను పరిశీలిస్తున్న ఏఓ మయాన్ మంజుఖాన్

వైరారూరల్: మండలంలోని దాచాపురం గ్రామంలో రైతులు సేంద్రీయ ఎరువులలో భాగంగా వేసిన జీలుగు, జనుము పంటలను బుధవారం మండల వ్యవసాయ శాఖ అధికారి మయాన్ మంజుఖాన్ పరిశీలించారు. జీలుగులు భూమిలో కలియ దున్నడం వలన నేలలో కార్బన్ శాతం, హ్యూమస్ పెరిగి నేల సేంద్రీయంగా మారుతుందన్నారు. 40 రోజుల వ్యవధిలో జీలుగు పంటను భూమిలో కలియ దున్నాలని సూచించారు. ఏఈఓ సపావత్ సైదులు, రైతులు శీలం అంజిరెడ్డి, ముక్కార చెన్నారెడ్డి, గుడూరు రామిశేషిరెడ్డి, శీలం అశోక్ రెడ్డి తదితరులున్నారు.

తహసీల్దార్‌కు వినతి

కారేపల్లి: సింగరేణి గ్రామ పంచాయతీ పక్కా భవనానికి స్థలం కేటాయించాలని సింగరేణి (కారేపల్లి) గ్రామస్తులు తహసీల్దార్ సంపత్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. కారేపల్లి పోలీసు స్టేషన్ సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలం సర్వే నంబర్ 38లో పంచాయతీ పక్కా భవనానికి స్థలం కేటాయించాలని, గత 40ఏళ్లుగా పాత పంచాయతీ భవనంలో కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు నారాయణ, నాగాచారి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పదకొండేళ్లుగా ఇంతేనా..?

నిర్మాణానికి నోచుకోని తల్లాడ స్త్రీ శక్తి భవనం

- అద్దె భవనంలోనే కార్యకలాపాలు
- ఇబ్బంది పడుతున్న సిబ్బంది, మహిళలు



స్త్రీ శక్తి భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం



అద్దె భవనంలో కొనసాగుతున్న మండల సమాఖ్య కార్యాలయం

తల్లాడ: మహిళా సాధికారిత కోసం గత ప్రభుత్వం మండలానికో స్త్రీ శక్తి భవనం నిర్మించాలని తలచింది. నిధులు కూడా మంజూరు చేసింది. అయినా తల్లాడ మండల స్త్రీ శక్తి భవనం మాత్రం నిర్మాణానికి నోచుకోలేదు. పదకొండేళ్లుగా ఈ భవన నిర్మాణం విషయంలో పట్టిన గ్రహనం ఇప్పటికీ వీడటం లేదు.

నిలిచిపోయిన పనులు..

తల్లాడ స్త్రీ శక్తి భవనానికి పదకొండేళ్ల క్రితం నిధులు మంజూరు కాగా స్థానిక గ్రామ పంచాయతీ స్థలంలో, ఎంపీడీఓ కార్యాలయం పక్కనే నిర్మించాలని స్థలం కేటాయించగా.. అప్పటి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ క్రమంలో కొందరు స్థలాన్ని స్త్రీశక్తి భవనా నికి కేటాయించొద్దని కోర్టును ఆశ్రయించడంతో 2017 సెప్టెంబర్ వరకు నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

నారాయణపురంలోకి మార్పు..

ఇక్కడ పనులు నిలిచిపోవడంతో తల్లాడ సమీపంలోని నారాయణపురంలో రాష్ట్రీయ రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని స్త్రీ శక్తి భవనానికి కేటాయించారు. దీంతో 2017 అక్టోబర్ 29న అప్పటి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భవన నిర్మాణానికి రూ.28లక్షలు కేటాయించి, శంకుస్థాపన చేశారు. అయినా పనులు ముందుకు సాగకపోవడంతో నిధులు వెనక్కిపోయాయి. దీంతో అక్కడ శిలాఫలకం మాత్రమే దర్శనమిస్తుంది. 2019లో ఆ స్థలాన్ని రైతువేదిక భవనానికి కేటాయించారు కానీ.. ఆ భవనం ఎన్నెస్పీ స్థలంలో నిర్మించడంతో మళ్లీ స్త్రీశక్తి భవనానికి కేటాయించారు.

అద్దె భవనంలో నిర్వహణ..

సొంత భవనం లేకపోవడంతో తల్లాడలోని అద్దె భవనంలో నిర్వహిస్తున్న కార్యకలాపాలకు ఇరుకుగా ఉండడంతో వెలుగు సిబ్బందికి, డ్వాక్రా మహిళలకు ఇబ్బందులు తప్పడం లేదు. బ్యాంక్ లింకేజీ పనుల నిమిత్తం మండలంలోని అన్ని గ్రామాల నుంచి డ్వాక్రా మహిళలు ఇక్కడకు వస్తుంటారు.

మండల వ్యాప్తంగా వివరాలిలా..

మండల వ్యాప్తంగా 52మంది గ్రామ సమాఖ్యలు ఉండగా.. 1350 గ్రూపులు, 13,500మంది డ్వాక్రా మహిళలు ఉన్నారు. కొత్త భవనంలో నిర్వహణ సాగించాలంటే రూ.10వరకు నెలనెల కిరాయి అవుతుంది. కావున పాత భవనంలోనే నిర్వహణ కొనసాగిస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..



తల్లాడ మండల కేంద్రంలో మహిళలకు స్త్రీ శక్తి భవనం లేకపోవటంతో బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, షాపుల వద్ద నిలబడాల్సి వస్తోంది. అద్దె భవనం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. కనీసం మహిళల కోసం బాత్‌రూమ్స్, టాయిలెట్స్ కూడా లేవు.

– శిలువమ్మ, తల్లాడ

– భూక్యా తులసి, గాంధీనగర్‌తండా

నిధులు వెనక్కి వెళ్లాయి..

స్థలం కేటాయించినప్పటికీ పనులు ప్రారంభించడంలో జాప్యం చేయటంతో నిధులు వెనక్కి వెళ్లాయి. తిరిగి స్త్రీ శక్తి భవనానికి నిధులు మంజూరు చేసి కేటాయించిన స్థలంలో పనులు ప్రారంభించాలి. మండలంలోని డ్వాక్రా మహిళలందరికీ ఈ భవనం సౌకర్యంగా ఉంటుంది. భవనం లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.

– అశోకారాణి, ఏపీఎం, తల్లాడ

చెత్త, డ్రెయినేజీల్లో పూడిక తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



బస్టాండ్ సెంటర్‌లో చెత్త తొలగిస్తున్న సిబ్బంది

కారేపల్లి: కారేపల్లిలోని పలు వీధుల్లో పేరుకుపోయిన చెత్త, డ్రెయినేజీల్లో పూడికను గ్రామపంచాయతీ సిబ్బంది తొలగించారు. 'ఏ వీధి చూసినా.. చెత్తే'శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు ఉదయమే కార్మికులతో పని చేయించారు. ఈ సందర్భంగా ఎంపీఓ రవీంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ వర్కర్లతో వీధిలైట్లు, తాగునీటి పైపులైన్ల మరమ్మతులు చేయిస్తుండడంతో ఇతర పనుల్లో జాప్యం జరిగిందని తెలిపారు. అంతేకాక దుకాణాదారులు చెత్తాచెదారాన్ని రోడ్డుపై వేస్తున్నందున వారికి నోటీసులు జారీ చేస్తామన్నారు.

ఇసుక లారీ పట్టివేత

వేంసూరు: ఆంధ్రా నుంచి అక్రమంగా ఇసుకను తీసుకొస్తున్న లారీని బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న తిరుపతి సురేష్‌పై కేసు నమోదు చేశారు.

తృటిలో తప్పిన ప్రమాదం



రహదారి పక్కన గుంతలోకి జారిన టాటాఏస్ వాహనం

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని సైదులు దర్గా సమీపంలో మధిర వైపు నుంచి వైరా వస్తున్న టాటా ఏస్ వాహనం ఎదురుగా వస్తున్న ఆర్టీసీబస్సు, లారీని తప్పించబోయి పక్కకు రావడంతో ఇటీవలే రోడ్డు నిర్మాణం కోసం తీసిన భారీ గుంటలోకి జారి నిలిచిపోయింది. దీంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు, వాహనదారుడు ఊపిరి పీల్చుకున్నారు.

సేవలు అభినందనీయం



పదోన్నతిపై బదిలీ అయిన ఉద్యోగులను సన్మానిస్తున్న మున్సిపల్ కమిషనర్ నర్సింహా, ఉద్యోగులు

సత్తుపల్లి: సత్తుపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి, పారిశుద్ధ్య పనుల నిర్వహణలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, జూనియర్ అసిస్టెంట్లు లోకేష్, బి.రామచంద్రులు అందించిన సేవలు అభినందనీయమని కమిషనర్ కె.నర్సింహా అన్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయినా బి.రాధాకృష్ణ, జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తూ సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొంది ఖమ్మం, డోర్నకల్‌లకు బదిలీ అయినా వి.రామచంద్రు, లోకేష్‌లను బుధవారం రాత్రి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మేనేజర్ మైసా శ్రీనివాస్, ఏఈ సురేష్, ఏఓ కిరణ్, టౌన్‌ప్లానింగ్, మెప్మా, వార్డు ఆఫీసర్లు, శానిటేషన్ సిబ్బంది, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న లింగాల కమల్‌రాజ్, కొండబాల కోటేశ్వరరావు

చింతకాని: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమలరాజ్, మధిర మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు విమర్శించారు. బుధవారం లచ్చగూడెంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 19 నెలలు గడిచినప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను మాత్రం నెరవేర్చలేదన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అని.. ఇప్పటివరకు 45శాతం మాత్రమే రుణమాఫీ చేసిందన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి వెంకట్రామయ్య, నాయకులు హనుమంతురావు, రమేష్, సత్యనారాయణ, ప్రసాద్, బాబురావు పాల్గొన్నారు.

11కేవీ విద్యుత్ లైన్‌ను నిలిపివేయాలి

మధిర: ఇళ్ల మీదుగా ఏర్పాటు చేస్తున్న 11కేవీ విద్యుత్ లైన్‌ను నిలిపివేయాలని సీపీఎం మండల కార్యదర్శి మందా సైదులు అన్నారు. బుధవారం కంభంపాడు గ్రామప్రజలతో కలిసి స్థానిక విద్యుత్ ఏడీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి మాట్లాడారు. ప్రజలకు ఇబ్బంది కలిగే విద్యుత్ లైన్‌ను గ్రామం బయట నుంచి ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఏడీ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు వెంకటనర్సయ్య, లాలు, అమరయ్య, లాల్‌సాహెబ్, నాగుల్‌మీరా, రవి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

27న జాబ్ మేళా



మాట్లాడుతున్న ఫాదర్లు థామస్, జస్టన్

తల్లాడ: క్రీస్తు జ్యోతి జూనియర్ కళాశాల ఆవరణలో ఈ నెల 27న ఖమ్మం పీఠాధిపతులు సగిలి ప్రకాష్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఫాదర్ థామస్, ఫాదర్ జస్టన్ తెలిపారు. క్రీస్తు జ్యోతి జూనియర్ కళాశాలలో బుధవారం వారు మాట్లాడుతూ.. కళాశాల యాజమాన్యం, డాన్ బోస్కో పాఠశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాకు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ పూర్తిచేసిన వారు హాజరు కావాలన్నారు. ఉద్యోగ మేళాకు విచ్చేస్తున్న కంపెనీలు ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, మెడ్ ప్లస్, జీఎంఆర్, హెల్త్‌కేర్ మొత్తం 25 కంపెనీలు వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని వారు పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు వెంటనే నియామక పత్రాలను అందిస్తారని, వివరాలకు 9494092219, 8310133469 నంబర్లను సంప్రదించాలన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

కల్లూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు చలమల విఠల్ పేర్కొన్నారు. బుధవారం అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో (సీఐటీయూ) సమ్మె నోటీస్ ఐసీడీఎస్ సీడీపీఓ నిర్మిల జ్యోతికి అందించారు. కేంద్రం కోడ్‌లను అమలు చస్తే కార్మికులు బానిసలుగా బ్రతకాల్సి వస్తుందన్నారు. జూలై 9 దేశ వ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ బాధ్యులు నాగమణి, శ్రీదేవి, వాణిశ్రీ, జ్యోతి, రాణి, రాజకుమారి, సుజాత, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు



తెల్లపాలెంలో పరిశీలిస్తున్న అధికారులు

ఎర్రుపాలెం: మండలంలోని తెల్లపాలెం గ్రామంలో నూతన విద్యుత్ స్తంభాలను, కొత్త విద్యుత్ లైన్లను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ పనులకై భట్టి విక్రమార్క రూ.8లక్షలు మంజూరు చేయగా.. చేపడుతున్న పనులను మధిర ఏడీఈ అనురాధ, స్థానిక విద్యుత్ ఏఈ జి.అనూష బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు ఇస్మాయిల్, శ్రీనివాసరావు, బాబురావు, చెన్నయ్య, నాగిరెడ్డి, వెంకటనర్సయ్య తదితరులున్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడాలి

వైరారూరల్: దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. బుధవారం గొల్లనపాడులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు సరైన ఆహారం, విద్య, వైద్యం అందించకపోవడం, పార్లమెంట్‌లో వ్యవసాయ రంగం, ఉపాధి మీద చర్చ జరపకుండా దాటివేదయం అప్రజాస్వామిక చర్యగా పరిగణించాలన్నారు. ఖమ్మం జిల్లాలో గత రబీ సీజన్‌కు సంబంధించి పెడింగ్‌లో ఉన్న రూ.63 కోట్ల బోనస్ నగదును తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కిలారు శ్రీనివాసరావు, వెంపటి రాజా, అమరనేని వెంకటేశ్వరరావు నల్లమోతు రాజాబాబు, కొణిదేన ధర్మారావు, అమరనేని సాంబశివరావు, చంద్ర వెంకట్రావు తదితరులున్నారు.

పుణ్యక్షేత్రాలకు బస్సు..

మధిర: మధిర నుంచి పుణ్యక్షేత్రాలకు వెళ్లే ప్రయాణికులకు సువర్ణావకాశాన్ని కల్పిస్తున్నట్లు మధిర ఆర్టీసీ డిపో మేనేజర్ దాసరి శంకర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధిర నుంచి శుక్రవారం ఉదయం 5 గంటలకు బయలుదేరి తిరిగి తెల్లవారుజామున 4 గంటలకు మధిర చేరుకుంటుందని తెలిపారు. వరంగల్ వేయి స్తంభాల గుడి, భద్రకాళి అమ్మవారి ఆలయం, రామప్ప దేవాలయం, సమ్మక్క, సారక్క ఆలయం, మల్లూరు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వంటి యాత్రలు ఉంటాయని తెలిపారు. పెద్దలకు రూ.1,000, పిల్లలకు రూ.500 ఛార్జి ఉంటుందన్నారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉందన్నారు.

సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న ఐద్వా నాయకురాలు

కొణిజర్ల: కొణిజర్ల మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సౌకర్యాలు కల్పించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మేరుగు రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఐద్వా కొణిజర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో పీహెచ్‌సీని సందర్శించి సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మేరుగు రమణ మాట్లాడుతూ.. వైరా నియోజకవర్గంలో అతి పెద్ద మండలంలో పీహెచ్‌సీ కేవలం 6 పడకల ఆస్పత్రిగా ఉండటం, 24 గంటల సౌకర్యం లేకపోవడం విడ్డూరమన్నారు. తక్షణమే కొణిజర్ల పీహెచ్‌సీని 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసి 24 గంటల వైద్యసేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు విజయ, కుమారి, పద్మని తిలకం పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ఏన్కూరు: ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఏన్కూరు/కొణిజర్ల: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. బుధవారం ఏన్కూరులోని రైతు వేదిక భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. అదే విధంగా కొణిజర్లలోని శ్రీరామ కల్యాణమండపంలో 65 మంది లబ్ధిదారులకు రూ.65,07,540ల కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను, 27మంది లబ్ధిదారులకు రూ.7,46,500ల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. కొణిజర్ల, గుబ్బగుర్తి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించుకున్నామని, అన్నిగ్రామాల్లో లబ్ధిదారులు ముగ్గులు పోసుకునేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఉచితబస్సు, ఉచిత కరెంట్, రూ.2 లక్షలు రుణమాఫీ చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామన్నారు. రైతుల సంక్షేమానికై రూ.9 వేల కోట్లు రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో వేశామన్నారు. ఈ ప్రభుత్వాన్ని ప్రజలంతా ఆదరించి రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలన్నారు. ప్రతిపక్షాలు కాంగ్రెస్ పార్టీపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని కార్యకర్తలు వాటిని తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓలు రోజారాణి, నారాయణ, ఎస్సై రఫి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు నారాయణరావు, నరేందర్, మాజీ ఏఎంసీ చైర్మన్ లాలూ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ప్రభావతి, తహసీల్దార్ ఎస్.అరుణ, డీటీ రాము, ఆర్ఐలు రమేష్, నరేష్, దర్శి చెన్నారావు, సీనియర్ నాయకుడు సూరంపల్లి రామారావు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన



బోనకల్: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

వైరా: వైరాలోని మధు విద్యాలయంలో బుధవారం వైరా ఎక్సైజ్, ప్రొహిబిషన్ వారి ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎక్సైజ్ ఎస్ఐలు రతన్ ప్రసాద్‌రెడ్డి, ఎం సాయిరామ్‌లు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు గురించి విద్యార్థులకు వివరించి.. వారిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ..

బోనకల్: మండలంలోని షైన్ హైస్కూల్‌లో బుధవారం మాదకద్రవ్యాల నిర్మూలనపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఎస్సై పొదిలి వెంకన్న పాల్గొని మాట్లాడారు. అనంతరం మాదకద్రవ్యాల వలన కలగే అనర్థాలను వివరించి, పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

'బీజేపీది అప్రకటిత ఎమర్జెన్సీ'



సత్తుపల్లిరూరల్: మాట్లాడుతున్న రమేష్

బోనకల్/తల్లాడ/సత్తుపల్లిరూరల్: ఆనాడు కాంగ్రెస్ దేశంలో ప్రకటిత ఎమర్జెనీని విధిస్తే, నేడు బీజేపీ అప్రకటిత ఎమర్జెన్సీని అమలు చేస్తుందని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాల్‌రావు అన్నారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జొన్నలగడ్డ సునీత అధ్యక్షతన నిర్వహించిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లాడలోని దొడ్డా కృష్ణయ్య భవనంలో.. పులి కృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు, సత్తుపల్లిలోని సీపీఎం సత్తుపల్లి మండల, టౌన్ కమిటీల ఆధ్వర్యంలో స్థానిక రావి వీరవెంకయ్య భవనంలో.. మోరంపూడి పాండు రంగారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాదినేని రమేష్ పాల్గొన్నారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందని, రాజ్యాంగ సూత్రాలపై బీజేపీ ప్రభుత్వం దాడి మరింత ప్రమాదకరమైందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిక స్వేచ్ఛను, పౌర హక్కులను అణచివేసి ఎన్‌కౌంటర్ల పేరుతో వందలాది మంది యువకులను పట్టుకొని కాల్చి చంపారన్నారు. ఇది భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి మాయని మచ్చని, చరిత్రలో చీకటి అధ్యాయం ఆ ఎమర్జెన్సీ ప్రకటించి 50 సంవత్సరాలు పూర్తి అయిందన్నారు. ఈ సమావేశాల్లో నాయకులు నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, సురేష్, శ్రీనివాసరావు, సత్యనారాయణ, సీపీఎం మండల కార్యదర్శి రామలింగేశ్వరరావు, కృష్ణయ్య, ఫకీరమ్మ, మస్తాన్, జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్, టౌన్, మండల కార్యదర్శులు సర్వేశ్వరరావు, జ్యోతి, వెంకటరావు, మల్లికార్జున్‌రావు, బుచ్చయ్య, సనందన్‌రావు, రత్నకుమారి, ఝాన్సీ, పుష్పవల్లి, కుమారస్వామి, వేలాద్రి, భాస్కర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వాటా జమచేయాలి



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు

మధిర: సీపీఎస్ ఉద్యోగుల ప్రభుత్వ వాటాను వెంటనే జమచేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మధిరలోని టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. ఈ-కుబేర్ పెండింగ్ బిల్లులను తక్షణమే జమచేయాలన్నారు. ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేయటం సంతోషకరమని తెలిపారు. అవసరమైన చోట అదనపు పోస్టులను మంజూరు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయ కన్వీనర్ వినోదరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారు నాగరాజు, వీరయ్య, ఉపాధ్యక్షులు షేక్ ఇబ్రహీం, కాజా సునిత, కోశాధికారి బైర్ల చెన్నయ్య, మండల కార్యదర్శులు రఫి, రాణి, కవిత, రాజు, షేక్ లాల్ అహ్మద్, కొండలరావు, ఆదాం, నాగేశ్వరరావు, రాంబాబు, గోపిచంద్, రాణి, భూలక్ష్మి, కృష్ణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గొడుగు వితరణ



గొడుగు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో బ్యాగులు అమ్ముకుని జీవిస్తున్న సుబ్బారావు వీధి వ్యాపారికి బుధవారం గ్రేట్ విజన్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తోటకూర శ్రీకాంత్ ఆధర్యంలో గొడుగు వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీజీ డాక్టర్ కాపా మురళీ కృష్ణ, జీఎస్‌టీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్యాంబాబు, ట్రెజరర్ రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన..

ఏన్కూరు: ఏన్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బుధవారం కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలం మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్‌లో చక్కగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు డిక్షనరీలు, కాలేజ్ బ్యాగులు వితరణగా అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుందర్, కృష్ణ ప్రసాద్, బాబూలాల్, రామారావు, వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి, లైబ్రేరియన్ కవిత పాల్గొన్నారు.

విద్యార్థులకు సామగ్రి..



విద్యార్థులకు సామగ్రి అందిస్తున్న రావుడ్యా, యూత్ సభ్యులు

ఏన్కూరు: మండలంలోని హిమామ్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన బానోత్ రావుడ్యా తన తండ్రి బీమ్లా జ్ఞాపకార్థం సుమారు రూ.4 వేలు విలువైన నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర సామగ్రి అందించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం సాగి సుజాత, పాఠశాల హెచ్‌ఎం దివ్య, ఉపాధ్యాయురాలు శైలజ, యూత్ సభ్యులు వెంకటేష్, శివ,రాజేష్, నవీన్, సతీష్, రామ్‌చరణ్, పెద్దలు పాల్గొన్నారు.

పాఠశాలలో 64మంది విద్యార్థుల చేరిక

ముదిగొండ: మండలపరిధిలోని యడవల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో 64మంది విద్యార్థులు పాఠశాలలో చేరినట్లు పాఠశాల హెచ్‌ఎం ఎం.నాగలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బడిబాట కార్యక్రమంలో తనతోపాటు ఉపాధ్యాయులు గ్రామంలోని తల్లిదండ్రులు కలిసి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉత్తమ బోధన అందిస్తున్నట్లు ఆమె తెలిపారు.